క్లుప్తంగా

నేడు ప్రజావాణి

తాండూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చిన్నప్పల నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ప్రజావాణి ఉంటుందని తెలిపారు. కావున ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అమ్మవారిని దర్శించుకున్న సీఐ



ఎల్లమ్మ సన్నిధిలో సీఐ రాంబాబు

తాండూరు రూరల్: కోత్లాపూర్ గ్రామ శివారులో ఉన్న రేణుక ఎల్లమ్మ అమ్మవారిని రూరల్ సీఐ రాంబాబు దర్శించుకున్నారు. ఆదివారం ఆలయానికి చేరుకున్న సీఐ దంపతులు.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ సందీప్‌రెడ్డి సీఐని శాలువ, పూలమాలతో సన్మానించారు. భక్తుల కొంగు బంగారం కోత్లాపూర్ రేణుక ఎల్లమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందని సీఐ చెప్పారు.

హక్కులసాధనకు సంఘటితం కావాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

కుల్కచర్ల: ముదిరాజులందరూ హక్కులసాధనకై సంఘటితం కావాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కుల్కచర్ల గ్రామ కమిటీ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ముదిరాజులు ఒక్కటిగా ఉంటేనే మనకు దక్కాల్సిన పథకాలు దక్కుతాయని చెప్పారు. కార్యక్రమంలో కాటనిపల్లి అంజిలయ్య, కర్ణయ్య, చెన్నయ్య, గుడాల వెంకటయ్య, భగత్, శ్రీను, వెంకటేశ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉల్లి సేకరణ



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఉల్లి సంచులు

ధారూరు: ఉల్లి పంట చేతికి రావడంతో రైతులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని కేరెళ్లి, కొండపూర్‌ఖుర్దు, ధారూరు, బాచారం, ఎబ్బనూర్, చింతకుంట, హరిదాస్‌పల్లి, అవుసుపల్లి తదితర గ్రామాల్లో ఉల్లి సాగులో ఉంది. ప్రస్తుతం పంట చేతికి రావడంతో ఉల్లిని సేకరిస్తున్నారు. సంతలో కిలో ఉల్లిగడ్డ రూ.30 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. టోకుగా క్వింటాల్‌కు రూ.600 నుంచి రూ.1,000 వరకు ధర పలుకుతోంది. కూలీల కొరత కారణంగా సకాలంలో సేకరించలేకపోతున్నామని రైతులు తెలిపారు. క్రమంగా ఉల్లి ధరలు తగ్గే అవకాశాలు ఉన్నాయని, తొందరగా సేకరించి విక్రయిస్తే లాభం వస్తుందని రైతులు తెలిపారు.

రైతువేదిక.. ఉపయోగం లేక

- నిధులున్నా పట్టని నిర్వహణ
- అస్తవ్యస్తంగా మారిన మరుగుదొడ్లు
- మందుబాబులకు 'వేదిక'గా మారిన వైనం
- పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు
- నిరుపయోగం అంటున్న రైతులు



ఐనెల్లి క్లస్టర్ రైతు వేదిక



అస్తవ్యస్తంగా మరుగుదొడ్డి

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతు వేదికలు అస్తవ్యస్తంగా మారాయి. వేదిక నిర్వహణను వ్యవసాయ శాఖ అధికారులు గాలికి వదిలేయడంతో.. అవి మందుబాబులకు అడ్డాగా మారాయి. మరికొన్ని రైతు వేదికల వద్ద టాయిలెట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారి.. ఆ పరిసర ప్రాంతాలు కంపుకొడుతున్నాయి. తాండూరు మండలంలో 33 గ్రామాలు ఉన్నాయి. ఏడు క్లస్టర్లలో రైతు వేదికలు నిర్మించారు. అంతారం, సిరిగిరిపేట్, కరన్‌కోట్, నారాయణపూర్, బెల్కటూర్, ఐనెల్లి, చెంగోల్‌లో రైతు వేదికలు ఒక్కో దాని కింద మూడు నుంచి నాలుగు గ్రామాలు వస్తాయి. ఈ వేదికల్లో నెలనెలా రైతులతో సమావేశాలు నిర్వహించాలి. కానీ సమీక్షలు ఎప్పుడు నిర్వహిస్తున్నారో తెలియదని, ఆ వేదికలు నిరుపయోగంగా మారి బూతుబంగ్లాను తలపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

నిధులున్నా..

రాష్ట్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు రైతు వేదికల నిర్వహణకు నెలకు రూ.9 వేలు మంజూరు చేస్తున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలలకు సంబంధించి ఒక్కో వేదికకు రూ.45 వేలు మంజూరయ్యాయి. ఈ నిధులు సంబంధిత వ్యవసాయశాఖ ఏడి ఖాతాలో ఉన్నతాధికారులు జమ చేశారు. ఏడీ మాత్రం ఏఈఓల ఖాతాల్లో జమ చేసినట్లు చెబుతున్నా.. ఇప్పటి వరకు తమ ఖాతాల్లో నిర్వహణ నిధులు జమకాలేదని ఏఈఓలు చెబుతున్నారు. దీంతో వ్యవసాయశాఖ కార్యాలయంలో గందగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

అలంకార ప్రాయంగా..

ఈ వేదికలతో తమకు ఎలాంటి ఉపయోగంలేదని రైతులు చెబుతున్నారు. రూ.లక్షలు పెట్టి నిర్మించిన ఆ వేదికలు అలంకార ప్రాయంగా ఉన్నాయని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని అన్నదాతలు వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి.. రైతు వేదికల పర్యవేక్షణకై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదేశాలు జారీ చేస్తాం



తాండూరు డివిజన్‌లోని ఒక్కో రైతు వేదికకు నిర్వహణ నిమిత్తం రూ.9 వేలు మంజూరయ్యాయి. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు నిధులు వచ్చాయి. ఏఈఓల ఖాతాల్లో కూడా జమ చేయడం జరిగింది. అన్ని రైతు వేదికల వద్ద పారిశుద్ధ్యంతో పాటు పరిసరాలను శుభ్రం చేయిస్తాం. నిర్వాహణ మెరుగుపడే విధంగా కృషి చేస్తాం.

– రుద్రమూర్తి, వ్యవసాయశాఖ ఏడి, తాండూరు డివిజన్

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

యాలాల: గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ ఆస్పత్రులు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడం అభినందనీయమని రాస్నం సర్పంచ్ కావలి సురేఖ అన్నారు. ఆదివారం గ్రామంలోని రైతు వేదికలో నగరానికి చెందిన ఇమేజ్ ఆస్పత్రి వారు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సేవా దృక్పథంతో ప్రైవేటు ఆస్పత్రులు వైద్య సేవలందించడం గొప్ప విషయమన్నారు. మెరుగైన వైద్య చికిత్స అవసరమున్న వారికి రిఫర్ చేసి సేవలందించారని తెలిపారు. ఈ శిబిరానికి గ్రామస్తుల నుంచి భారీగా స్పందన లభించిందని, అనేక మంది వైద్య పరీక్ష చేయించుకున్నారని సర్పంచ్ చెప్పారు. బీపీ, షుగర్, ఈసీజీ లాంటి పరీక్ష చేశారని, అనంతరం వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, వైద్యులు రమేష్‌రెడ్డి, శివానీ, ధర్మతేజ, జీవీరావు, గ్రామస్తులు రాంచంద్రారెడ్డి, మధు, బాబయ్య తదితరులు ఉన్నారు.

అపరిచితులతో అప్రమత్తం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ధారూరు: సైబర్ నేరాలు, దొంగతనాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు చెప్పారు. నాగారంలో ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పోలీసులు మాట్లాడారు. సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. గుర్తు తెలియని లింకులను ఓపెన్ చేసి ఓటీపీలు షేర్ చేయరాదని సూచించారు. తీర్థయాత్రలు, దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పక్కింటి వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేయాలని పేర్కొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణం వేగిరం

కొడంగల్: పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణం వేగంగా సాగుతోంది. అయ్యప్ప సేవా సమితి సభ్యులు, భక్తుల సహకారంతో పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది కార్తీక మాసం వరకు పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. వచ్చే ఏడాది మకర సంక్రాంతిన స్వామివారి పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో పనులు జరుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



క్రీడాకారులతో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తదితరులు

కొందుర్గు: యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. చౌదరిగూడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఫైనల్‌కు చేరుకున్న సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని టోర్నీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు వాటిని సమానంగా స్వీకరించాలని సూచించారు. ఓటమి గెలుపునకు నాందిగా భావించి, ఆటలను స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగించాలన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్, శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు సత్యప్రమోద్‌రావు, నాగరాజు, రాములు, బంగారు రాములు పాల్గొన్నారు.

బీరప్ప ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

జిల్లేడ్‌చౌదరిగూడ మండలం ఎల్కగూడ గ్రామంలో నిర్వహించిన బీరప్పస్వామి ఉత్సవాలకు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కౌన్సిలర్‌కు పితృవియోగం

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు కౌన్సిలర్ బచ్చలి నర్సింహ తండ్రి బచ్చలి బాలయ్య (70) ఆదివారం తెల్లవారు జామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నట్‌రాజన్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు నర్సింహ్మ ఇంటికి వెళ్లి బాలయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలయ్య ఆత్మకుశాంతి చేకూరాలని ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా బీజేపీ నేతలు శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు బాలయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శంకుస్థాపనతోనే సరా!

- నిధులున్నా నిర్లక్ష్యం ఎందుకు?
- అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు చేపట్టరా?
- భవనం పూర్తి చేయాలంటూ దళిత సంఘాల డిమాండ్



భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొప్పుల (ఫైల్)

యాలాల: అట్టహాసంగా శంకుస్థాపన చేసి ఏడాది కావస్తున్నా.. భవన నిర్మాణ పనుల్లో పురోగతి లేదు. దీంతో దళిత, ప్రజా సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. 'నిధులున్నాయి. టెండర్ పనులు పూర్తయ్యాయి. మంత్రి ప్రారంభించారు. అయినా పనులు ఎందుకు చేపట్టడం లేదు. శంకుస్థాపనతోనే సరిపెడతారా?' అంటూ ప్రశ్నిస్తున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి మంజూరైన అంబేద్కర్ భవన నిర్మాణ పనులకు గతేడాది జులై 20న మంత్రి కొప్పుల ఈశ్వర్ శంకుస్థాపన చేశారు. ప్రారంభించి 8 నెలలు గడుస్తున్నప్పటికీ.. ఇప్పటి వరకు పనులు చేపట్టడం లేదు. మండల కేంద్రంలోని కేజీబీవీ భవనం పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి అనువైన స్థలంగా అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించారు. అందుకు గాను రూ.50 లక్షలు మంజూరయ్యాయి. అనంతరం మంత్రి శంకుస్థాపన చేశారు. అయితే ఆన్‌లైన్‌లో టెండరు పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ మాత్రం పనులు ప్రారంభించకపోవడంతో దళిత సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాప్యం తగదు..

నిధులున్నా పనులు ప్రారంభం చేయకపోవడంపై అసంతృప్తి చెందుతున్నారు. ప్రధాన రోడ్డు పక్కన అనువైన స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ పనులు జాప్యం చేయరాదని దళిత నాయకులు డిమాండ్ చేస్తున్నారు. భవనం పూర్తయితే దళితుల సంక్షేమ కార్యక్రమాలకు, సమావేశాలకు అనువుగా ఉంటుందని, అట్టహాసంగా శంకుస్థాపన చేసి, నిర్మాణ పనులపై దృష్టిసారించకపోవడం ఎంత వరకు సమంజసం అని ప్రశిస్తున్నారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వారం రోజుల్లో ప్రారంభిస్తాం

భవన నిర్మాణానికి ఆన్‌లైన్‌లో టెండరు పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే భవన నమూన, అవసరమైన ఏర్పాట్లను పరిశీలించాము. నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వారం రోజుల్లోగా పనులు ప్రారంభించే అవకాశం ఉంది. పనులు వేగిరం చేసి.. పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– వీరానందం, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, యాలాల

ఎమ్మెల్సీగా ఏవీఎన్‌రెడ్డిని గెలిపించాలి

బీజేపీ నాయకుడు ఆనంద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

కేశంపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ సీనియర్ నాయకులు పల్లె ఆనంద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీగా ఏవీఎన్‌రెడ్డిని గెలిపించి, శాసనమండలికి పంపిచాలన్నారు. ప్రభుత్వంతో పోరాడి 317 జీఓ రద్దుకు బీజేపీ కృషి చేస్తుందని ఆయన చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని, ప్రతి సంవత్సరం డీఎస్సీని నిర్వహించి నిరుద్యోగ బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేస్తామని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించే నాయకుడైన ఏవీఎన్ రెడ్డిని గెలిపించుకునేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కుమారస్వామి, శ్రీనివాసులు, పోలేపోగురాజు, గోపాల్‌రెడ్డి, తిరుపతయ్య, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన బసవేశ్వరస్వామి ఉత్సవాలు



జాతరలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కుల్కచర్ల: చౌడాపూర్ మండల పరిధిలోని కోటచింతల బసవేశ్వరస్వామి ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా అర్చకులు స్వామి వారికి కల్యాణోత్సవం, తదితర కార్యాక్రమాలు వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో అత్యధిక భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కిష్టంపల్లి సర్పంచ్ శ్రీనివాసులు, గ్రామస్తులు పెద్ద మల్లికార్జున, రమేశ్, సంతు, రాజు, నవీన్, కమ్మరి పాండురంగయ్య, రాజేశ్, ఉదయ్, కృష్ణయ్య, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి సహకరించండి

బీఆర్‌ఎస్ మండల యువజన నాయకుడు పాండురంగారెడ్డి

శంకర్‌పల్లి: దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని బీఆర్‌ఎస్ శంకర్‌పల్లి మండల యువజన విభాగం అధ్యక్షుడు జూలకంటి పాండురంగారెడ్డి అన్నారు. ఆదివారం శంకర్‌పల్లి అయ్యప్ప దేవాలయంలో ఉచితంగా బుర్జులకాడి శ్రీరాములు తండ్రి అంజయ్య, సుగుణ జ్ఞాపకార్థం బోర్‌వెల్స్ కృష్ణస్వామిగౌడ్ సహకారంతో ఉచితంగా బోరును వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప దేవాలయం అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మాజీ ఉప సర్పంచ్ సాత ప్రవీణ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు మిర్యాల శ్రీనివాస్, దండు మోహన్, విశ్వేశ్వర్, జంగయ్య, శ్రీనివాస్, పాండు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను తొలగించండి

మంత్రి సబితారెడ్డికి దామరగిద్ద గ్రామస్తుల విన్నపం



మంత్రి సబితారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: ఎస్సీకాలనీలో ఇళ్ల మధ్యలో ఉన్న శ్మశానవాటికను తొలగించి న్యాయం చేయాలని దామరగిద్ద గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ గ్రామస్తులు మంత్రి సబితారెడ్డిని కోరారు. నగరంలోని మంత్రి నివాసంలో ఆమెను ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ్మకు వినతి పత్రం అందజేసిన అనంతరం మాట్లాడారు. గ్రామంలో సర్వే నంబర్ 54లో ఇళ్ల మధ్యలో ఉన్న శ్మశానవాటికలో అంత్యక్రియలు జరగకుండా చూడాలని కోరారు. ఇళ్ల మధ్య ఉన్న శ్మశానవాటికను తొలగించి ప్రభుత్వం కేటాయించిన వైకుంఠధామంలో అంత్యక్రియలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వైకుంఠధామం అందరి కోసం కేటాయించిందని కానీ, కొంత మంది బీసీలు వినకుండా ఎస్సీ కాలనీలోనే అంత్యక్రియలు చేస్తామని మొండికేస్తున్నారని తెలిపారు. ప్రశ్నిస్తే మీకులం మాకులం అంటూ వేరు చేసి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీలో ఉన్న శ్మశానవాటికను తొలగించి మాకు న్యాయం చేయాలని కోరారు.

అ'పూర్వ' ఆత్మీయ సమ్మేళనం



అధ్యాపకులతో విద్యార్థులు

అనంతగిరి: పది కాదు, ఇరవై కాదు.. ఏకంగా ముప్పై వసంతాల స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ వారంతా ఏకమయ్యారు. వారే కాదు.. వారికి విద్యా బుద్ధులు నేర్పిన అధ్యాపకులు విద్యార్థులతో కలిసి సందడి చేశారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంబురంగా గడిపారు. వికారాబాద్ పట్టణం ఎస్ఏపీ కళాశాలలో 1989–1992 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణానికి సమీపంలోని అనంతగిరి గుట్ట ఫారెస్టు అతిథి గృహంలో జరిగిన ఈ సమ్మేళనంలో విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల ప్రస్తుత ప్రిన్సిపాల్ మందారికా మాట్లాడుతూ 30 ఏళ్ల అనంతరం నాటి విద్యార్థులు అంతా కలడం గొప్ప విషయమన్నారు. కళాశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ అధ్యాపకులు రాజరత్నం, శేఖర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, విద్యార్థులు కుంచం భూపాల్, యాస్కి శ్రీనివాస్, నర్సింహులు, హీర్యానాయక్, కృష్ణయ్య, శ్రీనివాస్, శ్రీదేవి, ఉమారాణి, మనీల తదితరులు పాల్గొన్నారు.

చిన్న బస్టాండుతో ప్రయాణికుల చింత

ప్రజా సౌకర్యార్థం, ప్రజల వద్దకే పాలన అంటూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త మండలాలు ఏర్పాటు చేసింది. కానీ పాలకులు, అధికారులు నిర్లక్ష్యంతో 'పేరు పెద్ద ఊరు దిబ్బ' లాగా మారింది ఆ మండలాల పరిస్థితి. కొన్ని ప్రాంతాల్లో కనీస వసతులు కొరవడి ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. కనీసం ప్రజా అవసరాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థను మెరుగు పర్చాలన్న ఆలోచన పాలకులకు రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- సరైన ప్రయాణ ప్రాంగణం లేక పాట్లు
- మండలముగా మార్చినా.. సౌకర్యాలు నిల్
- పట్టించుకోని పాలకులు, ఆర్టీసీ యాజమాన్యం



కోట్‌పల్లి మండల కేంద్రంలోని చిన్నపాటి బస్ షెల్టర్ ఇదే

బంట్వారం: బస్టాండ్ నిర్మాణం చేపట్టకపోవడంతో కొత్తగా ఏర్పడిన కోట్‌పల్లి మండల కేంద్రంలో ప్రయాణికుల పాట్లు అన్నీఇన్నీకావు. రెండు దశాబ్దాల కిందట నిర్మించిన చిన్న పాటి బస్ షెల్టరే నేటికీ దిక్కైంది. ప్రయాణికుల రద్దీ మాత్రం ఎన్నోరెట్లు పెరిగింది. అయినప్పటికీ పాలకులు మాత్రం బస్టాండ్ మంజూరు దిశగా చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న బస్ షెల్టర్ ప్రయాణికులకు సరిపోవడం లేదు. దీంతో చాలా మంది హోటళ్లు, దుకాణాల వద్ద బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది.

సంత రోజున రద్దీ ఎక్కువ

మండల కేంద్రంలో ప్రతి సోమవారం సంత జరుగుతోంది. దీంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకులు, కూరగాయల నిమిత్తం కోట్‌పల్లికి వస్తుంటారు. బస్ షెల్టర్ పక్కనే సంత జరుగుతుండడంతో రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది. ప్రైవేటు వాహనాలు బస్ షెల్టర్‌కు ఎదురుగానే నిలపడం, చిరు వ్యాపారులు తోపుడు బండ్లను అక్కడే పెట్టడంతో ప్రయాణికులు ఇబ్బంది తప్పడం లేదు. బస్సులు వస్తే షెల్టర్‌లో కూర్చున్న ప్రయాణికులు త్వరగా వెళ్లలేకపోతున్నారు. వికారాబాద్–కోట్‌పల్లి లోకల్ బస్సులను వెనక్కి తిప్పడం డ్రైవర్లకు కష్టతరంగా మారింది.

కొత్త మండలముగా ఏర్పడినా

కొత్తగా ఏర్పడిన కోట్‌పల్లి మండలానికి ఇప్పటి వరకు బస్టాండ్ నిర్మాణం ఊసేలేదు. ఆర్టీసీ అధికారులు కనీసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన దాఖలాలు కూడా లేవు. వివిధ పనుల నిమిత్తం నిత్యం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువైంది. చాలా మంది బస్సుల్లోనే వస్తుంటారు. తాండూరు, వికారాబాద్, సంగారెడ్డి డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు కోట్‌పల్లికి వచ్చిపోతుంటాయి. ప్రతి రోజు వందలాది మంది వివిధ ప్రాంతాలకు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా పాలకులు, ఆర్టీసీ యాజమాన్యం స్పందించి బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.